

రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జాన్ విక్టర్‌ప్రసాద్‌కు కుప్పం అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు సోమవారం జిల్లాకు వచ్చారు. చిత్తూరు ఆర్ అండ్‌బి అతిధి గృహంలో బస చేసిన ఛైర్మెన్ విక్టర్ ప్రసాద్‌ను దళిత సంఘాల నేతలు, ఎంఎల్‌సి బరత్ ఘన స్వాగతం పలికారు. దళిత సంఘాల నేతలు జిల్లాలో దళిత సమస్యలపై ఛైర్మెన్‌కు వినతి పత్రాలు అందించారు.

మౌలిక వసతులేవీ..!

- కరెంటు, రోడ్లు లేక ఇక్కట్లు
- జగనన్న కాలనీల్లో అసౌకర్యాలు

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

డిసెంబర్ 21వ తేదీ నాటికి సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం హౌసింగ్ అధికారులను ఆదేశించింది. దీనిపై ఆగమేఘాలపై జిల్లాలో పనులు జరుగుతున్నాయి. ఆయా గృహ సముదాయాల వద్ద కరెంటు, నీరు, రోడ్లు సదుపాయాలు లేక జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గృహప్రవేశాలు సరే కనీసం వసతులు కల్పించండి అంటూ వారు వేడుకుంటున్నారు. అయితే ఇది నెరవేరే దారి మాత్రం కనిపించడం లేదు.

అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి ప్రభుత్వం జిల్లాలో పెద్దఎత్తున హౌసింగ్ పథకాన్ని తీసుకొచ్చిన విషయం విధితమే. ఇందులో భాగంగా జిల్లాలో 72225ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది. వీటిల్లో 63,050 ఇళ్లు రిజిస్టర్ చేసింది. ఇందులో 1639 లక్షల ఇళ్లు అసలు ఇప్పటివరకు ప్రారంభమే కాలేదు. 13,692 లక్షల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.



36 వేల ఇళ్లు పూర్తికి ప్రణాళిక..

కాగా ఇటీవల ప్రభుత్వం ఈ ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలనే ఉద్దేశ్యంతో జిల్లా వ్యాప్తంగా 36వేల గృహాలు పూర్తి చేయాలని నిర్ణయించింది. వీటన్నింటినీ డిసెంబర్ 21వ తేదీ నాటికి గృహప్రవేశాలు నిర్వహించాలని ప్రణాళికలు రూపొందించింది. ఇందులో సెప్టెంబర్ 22వ తేదీ వరకు పూర్తిచేసిన 13వేల గృహాలతో పాటు 32వేల పూర్తి చేయాలని నిర్ణయించింది.

వసతుల కరువు..

ఇంత వరకు బాగానే ఉన్నా ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులు కూడా లేకుండా పోయాయి. అధ్వాన దారులు, విద్యుత్ సరఫరా లేక రాత్రయితే చిమ్మచీకట్లే అలుముకుంటున్నాయి. జిల్లాలోనే అత్యంత ఎక్కువ నిర్మాణాలు జరుగుతున్న కాలనీల్లోనూ ఇదే దుస్థితి నెలకుంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైయ్యాయి. గుంతల రోడ్లలో నిర్మాణ సామగ్రి తరించేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై దృష్టి సారించాల్సి ఉంది. డిసెంబర్ నాటికి 32వేల గృహాలకు కనెక్షన్లు ఇవ్వాలనేది లక్ష్యం. అయతే నిర్మాణాలే సక్రమంగా జరగడం లేదు. ఇక విద్యుత్ కనెక్షన్లు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పూర్తయిన వాటికి ల్లో సగం వాటికి కూడా విద్యుత్‌సౌకర్యం ఇవ్వలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఓటర్ల నమోదుకు నేడే ఆఖరు

- మరింత మంది ఓటర్లు చేరే అవకాశం
- గడువు పెంపునకు అవకాశం

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి:

ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియ నేటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆఖరి రోజు భారీ ఎత్తున ఓట్లు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా రెండు, మూడు రోజులుగా భారీగా వస్తున్న దరఖాస్తుల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ గడువును మరికొన్ని రోజులు పెంచేందుకు అవకాశముందని చర్చ సాగుతోంది.

తూర్పు రాయలసీమ ప్రాంత పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజక వర్గానికి సంబంధించి అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతున్న విషయం విధితమే. తొలి 15రోజులు తక్కువగా ఓటర్లు నమోదు అవుతున్నా.. క్రమంగా పెరుగుతూ వస్తున్నారు. అధికారుల్లో ఉన్న సందేశాలు నివృత్తి కావడం, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓలు సమీక్షలు నిర్వహించడం వంటి కార్యక్రమాల వల్ల ఈ నియోజకవర్గం వ్యాప్తంగా నమోదు వేగంగా పెరుగుతోంది. 2.66లక్షల మందికిపైగా ఓట్లు నమోదు చేసుకున్నారు.



ఓటు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

రికార్డు స్థాయిలో..

ఈ మూడు ఉమ్మడి జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది పట్టభద్రులు, 12వేల మంది దాకా ఉపాధ్యాయులు ఉంటారు అనేది అంచనా. అయితే 20వ తేదీ వరకు ఆయా ప్రాంతాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటర్ల నమోదు కార్యక్రమం నత్తనడకన సాగింది. 20రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఊపందుకోలేదు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఫాం 18ను ఆన్‌లైన్‌లో 55,262 మంది. నేరుగా 9767 మంది నమోదు చేసుకున్నారు. ఇలా మొత్తంగా 67,598 మంది మాత్రం చేసుకున్నారు. ఇక ఉపాధ్యాయుల్లో ఆయా జిల్లాల్లో మొత్తం 1187 మంది నమోదయ్యారు. అయితే వారం రోజుల నుంచి నమోదు ప్రక్రియ పూర్తిగా మారిపోయింది. శనివారం రాత్రి వరకు అందిన వివరాల ప్రకారం ఆరు జిల్లాల పరిధిలో పట్టభద్రులు 198695 మంది ఆన్‌లైన్‌లో, 67312 మంది నేరుగా మొత్తం 2,66,007 మంది ఓట్లు నమోదు చేసుకున్నారు. ఆదివారం నాడు ఈ సంఖ్య మరింత పెరిగి ఉంటుందనేది అంచనా. మొత్తంగా 2.80 లక్షల మంది నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 71వేల మంది తమ ఓటును నమోదు చేసుకున్నారు. ఇక ఉపాధ్యాయుల్లో 12,815 మంది శనివారం రాత్రి వరకు నమోదు చేసుకున్నారు. వీరి సంఖ్య కూడా 14వేల వరకు పెరగొచ్చని అధికారులు చెబుతున్నారు.

ఓటు నమోదుకు అవకాశం

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకునేందుకు మళ్లీ అవకాశం వస్తుందని తెలుస్తోంది. వచ్చిన ఓట్లపైన ఫిర్యాదులు తీసుకుంటారు. దీనికి కొంత సమయం ఇస్తుంటారు. ఈ సమయంలో కొత్త ఓట్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

8న చంద్రగ్రహణం కారణంగా 11 గంటల పాటు

శ్రీవారి ఆలయ తలుపులు మూత

- బ్రేక్ దర్శనాలు రద్దు - 7న సిఫార్సు లేఖలు స్వీకరించబడవు

ప్రజాశక్తి- తిరుమల: చంద్రగ్రహణం కారణంగా ఈనెల 8న మంగళవారం ఉదయం 8.30 నుంచి రాత్రి దాదాపు 7.30గంటల వరకు 11 గంటల పాటు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. ఈ కారణంగా బ్రేక్ దర్శనం రద్దు చేసినందున ఈనెల 7న సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. మంగళవారం మధ్యాహ్నం 2.39 గంటల నుండి సాయంత్రం 6.27 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుంది. చంద్రగ్రహణం కారణంగా శ్రీవాణి, రూ.300లు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను టిటిడి రద్దు చేసింది. రాత్రి 7.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి చేసిన అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి టిటిడికి సహకరించాలని కోరడమైనది.

ట్రెక్కింగ్ అందరికీ అవసరం

మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: ఉరుకులు పరుగులతో సాగుతున్న యాంత్రికజీవితంలో ట్రెక్కింగ్ ప్రతిఒక్కరికి అవసరం అని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజ వ్యవస్థపకులు గల్లా రామచంద్ర నాయుడు తెలిపారు. ఆదివారం పూతలపట్టు మండలం పేటమిట్ట గుట్టల్లో అమరరాజ గ్రూప్ అభివద్ధి చేసిన సామాజిక అటవీ ప్రాంతంలో తిరుపతి ట్రెక్కర్స్ శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ అధ్వర్యంలో ట్రెక్కింగ్ నిర్వహించారు. వారికి గల్లా దంపతులు ఆతిథ్యం ఇచ్చారు. ఈసదర్భంగా వారి స్వగహంలో తిరుపతి నుంచి వచ్చిన ట్రెక్కర్స్‌తో మాట్లాడుతూ నిత్యజీవితంలో ట్రెక్కింగ్ వారానికి ఒకరోజు నిర్వహించటం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రస్తుతం మన దేశం, రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల్లో ఇలాంటి మంచి విషయాలు అలవాటుగా చేసుకుని ప్రతిఒక్కరు పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం పెటమిట్టలో అమరరాజ గ్రూప్ నిర్వహిస్తున్న స్కిల్‌డెవల్మెంట్ సెంటర్‌ను ట్రేక్కర్స్ సందర్శంచి నిరుద్యోగ యువతకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు పరిశీలించారు.

సిఎం స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం

మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్ : పీఎల్‌ఆర్ జాబ్‌సెంటర్ ద్వారా ఉద్యోగాలు పొందిన 109 మందికి నియామక పత్రాలు ఆదివారం రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసి ఛైర్మన్ ఏ.మల్లికార్జున రెడ్డి, జెడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీ కెఆర్‌జె.భరత్, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, టిటిడి పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పిఎల్‌ఆర్ జాబ్‌మేళా ద్వారా అనేక మందికి ఉద్యోగావకాశాలు చూపిస్తున్నారని, మన వంతు బాధ్యతగా తీసుకుని ఈ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని భావించామన్నారు. వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని ఈ చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల పేదకుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా పుంజుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో జాబ్ మేళాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జాబ్ మేళాల ద్వారా మూడు జిల్లాల పరిధిలో 11897 మందికి ఉద్యోగాలు కల్పించగా ఒక్క పుంగనూరు నియోజకవర్గంలో మొత్తం 6127 మందికి ఉద్యోగాలు, ఆర్మీకు 161 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విధానాలే స్ఫూర్తిగా ఈ జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి సిఎం బాటలో నడుస్తున్నామన్నారు.

విద్యారంగ ప్రతిష్టతకు కృషి

- నాడు- నేడుతో పాఠశాలల రూపురేఖల్లో మార్పు
- ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

నాడు- నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖల్లో అనేక మార్పులొచ్చాయని ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత మాటల్లో చెప్పలేమన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి పిల్లల అభివృద్ధి కోసం ఆర్థిక చేయూతను అందించేలా గోరుముద్ద, అమ్మఒడి, జగనన్న కానుక వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ ప్రత్యేకశ్రద్దతో ప్రాధమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల చేరిక పెరిగిందని, నేటి పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధనలో అనేక మార్పులు తీసుకొస్తున్నారని అన్నారు. ఫలితంగా ప్రభుత్వబడుల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయుల్లో ప్రతిభను పెంచేలా శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ విద్యావ్యవస్థ మరింత ప్రతిష్టం కానుందని అన్నారు. నాడు-నేడు మొదటి, రెండో విడతలో జిల్లాలోని అనేక పాఠశాలలు ఆధునీకరించడం జరిగిందన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీల సలహాల మేరకు ప్రహరిగోడలు, మరగుదొడ్లు, ఫ్లోర్ వేయడం వంటి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం నాడు- నేడు 297పాఠశాలల ఆదునీకరణ పనులు జరుగుతున్నాయని, నాడు-నేడు మూడో విడతలో మరిన్ని పాఠశాలలు కొత్త ఆధునీకరించబడుతాయని అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన మార్పుల ఫలితంగా ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం అవుతోందని తెలిపారు.

ప్రజాశక్తి : జగనన్న అమ్మఒడి 2020-21 విద్యాసంవత్సరంలో ఎంత మంది వచ్చింది?

డిఇఓ: జిల్లాలో మొత్తం విద్యార్థులు 6,77,524 ఉన్నారు. వీరిలో అర్హులుగా 5,59,289 మందిని గుర్తించి అమ్మఒడి వారి తల్లుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. జిల్లాలో రూ.527 కోట్లు అమ్మఒడి పథకం క్రింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేశారు.

ప్రజాశక్తి : ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ ఈ విద్యాసంవత్సరంలో ఎలా జరిగింది?

డిఇఓ: ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలోని 4,828 పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులకు 45,10,469 పాఠ్యపుస్తకాల అవసరం 17,63,950 పుస్తకాలు పంపిణీ చేశాం. 2,746, 519 పుస్తకాలు ప్రింటింగ్ కావాలి.

ప్రజాశక్తి : మోడల్ స్కూల్స్ నిర్వహణ ఎలా ఉంది?

డిఇఓ: జిల్లాలో 19 ఆదర్శ పాఠశాలల్లో మొత్తం ఆరు నుండీ ఇంటర్ వరకు 10,825 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 16 బాలికల వసతిగృహాలలో 1,600 బాలికులు వసతి పొందుతున్నారు. రూ.54కోట్లలో 18 పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నాం. నాడు- నేడు మొదటిదశలో 18 ఆదర్శ పాఠశాలలకు రూ.6.38 కోట్లు మంజూరు కాగా అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేయడం జరిగింది.

ప్రజాశక్తి : జగనన్న గోరుమద్దు పథకం అమలు తీరు ఎలా ఉంది...?

డిఇఓ: జిల్లాలో 4,828 ప్రాధమిక, ప్రాధమికొన్నత, ఉన్నత పాఠశాలల్లో 3,64,446 మంది విద్యార్థులు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా మధ్యహ్న భోజనం లబ్ది పొందుతున్నారు. వారానికి ఆరు కోడిగుడ్లు, 3 చిక్కీలు సరఫరా చేయబడుతోంది. జిల్లాలోని 8,355 స్వయం సహాయ సంఘాల మహిళలు గోరుముద్ద పథకంలో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారు. 2021-22 విద్యా సంవత్సరంలో రూ. 55.74కోట్లు గోరుముద్ద పథకంలో విద్యార్థులకు భోజనం అందిస్తున్న వంటమ్మల ఖాతాల్లో జమ చేశారు. వీరి గౌరవేతనం 2021మే వరకు అందించాం. ప్రాధమిక పాఠశాలల్లో పనిచేస్తున్న 4,933మంది ఆయమ్మలకు నెలకు రూ.6వేలు చొప్పున గౌరవ వేతనం ఆగస్టు 201 నుంచి ఫిబ్రవరి 2022 వరకు రూ.16.91కోట్లు వారిబ్యాంకు ఖాతాల్లో జమచేశారు.



ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు

నేడు నగర పాలక సంస్థలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం (7.11.2022) ఉదయం 10.30 నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరుకావాలన్నారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ నెంబర్ 08572-232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో.....

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నేడు చిత్తూరులోని పాత ఎస్పీ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా పరిధిలోని పోలీస్‌శాఖకు సంబంధించిన సమస్యలను స్పందనలో అర్జీల రూపంలో పోలీస్‌శాఖ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

డీఈవోకు అభినందనలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

నూతన విద్యాశాఖాధికారిగా నియమితులైన విజయేంద్రరావును ఉపాధ్యాయ సంఘాల మాజీ రాష్ట్ర నాయకులు, జేవివి నాయకులు బెల్లం మునిరత్నం కలసి అభినందనలు తెలిపారు. విద్యావ్యవస్థ బలోపేతంతో పాటు ఉపాధ్యాయ సమస్యలపై జిల్లా విద్యాశాఖాధికారి స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు.



డీఈవోకు అభినందనలు తెలుపుతున్న బెల్లం మునిరత్నం

సచివాలయాల్లో ఛార్జీల మోత..

ప్రజాశక్తి- తిరుపతిటౌన్ :

సచివాలయాల ఏర్పాటుతో అన్నిరకాల సేవలను నామమాత్రపు రుసుముతో అందిస్తామని ప్రభుత్వం తొలిరోజుల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. అయితే ఆరంభంలో అత్యధిక సచివాలయాలకు సరైన వసతి, ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడంతో మూడునెలలు వరకు పూర్తిస్థాయిలో సేవలు మొదలు కాలేదు. సచివాలయలల్లో 550 రకాల పౌరసేవలను అందించాలని 2020 జనవరిలో ఉత్తర్వులు జారీచేసింది. శాఖలవారీగా సేవలు, దరఖాస్తు చేసిన తరువాత ఎన్నిరోజుల్లో ధ్రువపత్రం అందుతుందో తెలియజేస్తు సచివాలయాల్లో సిటిజన్ ఛార్జీలను అందజేసింది. వీటిలో మొత్తం 16శాఖల ఉద్యోగులు పనిచేస్తుంటారు.



తొలుతు ఈసేవలను, ఎ,బి కేటగిరిలుగా విభజించి ఒక్కో సేవకు రూ.15లు మాత్రమే వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే సర్వర్లు తరుచు మొరాయిస్తుండడంతో ఇంటర్నెట్ స్పీడ్ చాలకపోవడంతో చాలా సచివాయాల్లో సేవలు అందని పనిస్థితి నెలకొంది. ఈవిషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో సర్వర్లు సామర్థ్యం పెంచింది. సర్వర్లు సామర్థ్యంతో పాటు సర్వీసు ఛార్జీలను కూడా ప్రభుత్వ పెంచేసింది. 2021 జనవరి నుంచి ఎ-కేటగిరి సేవల రుసుమును రూ.35లకు, బి కేటగిరి సేవల రుసుమును రూ.45లకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. అయినప్పటికి ప్రింటర్ల ఖర్చు, సచివాలయాల్లో నిర్వహణ వ్యయం పెరిగిపోయిందంటూ మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతిసేవకు రూ.5ల చొప్పున పెంచింది.

బి-కేటగిరి సేవల్లో భూములకు సంబంధించి ఈసీలు, ఇతరత్రా పత్రాలు, ఆధార్, నకళ్లువంటి సేవలకు రూ.50లు వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ నెట్‌సెంటర్లో కొన్నిరకాల బిల్లులు కట్టించుకుంటుండగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాయాల్లో సేవా పన్ను వసూలు చేస్తున్నారు.

అదనంగా సేవా రుసుము వసూలు..

ఏపిఈపీడిసిఎల్ జారీచేసిన బిల్లులో అంతే మొత్తాన్ని యూపిఐ యాప్ ద్వారా చెల్లించే వెసులుబాటు ఉంది. కొన్ని సచివాయాల్లో విద్యుత్ బిల్లు రూ.200లు లోపు అయితే రూ.2లు అంతకు మించి రూ.1000లు లోపు రూ.5, రూ.1001నుంచి రూ.2500లులోపు అయితే రూ.10వసూలు చేస్తున్నారు. రూ 2,500 దాటిన బిల్లు వస్తే సేవారుసుము కింద రూ.25లు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో విద్యుత్‌బిల్లులు చెల్లించేందుకు సచివాలయాలోకి వెళ్లేందుకు వినియోగదారులు ఆసక్తి చూపించడం లేదు. సిటిజన్ ఛార్జీలో పేర్కొన్నప్పటికి రూ.25ల కన్నా తక్కువ సేవలను మాత్రమే ప్రజలు వినియోగించుకుంటున్నారు. ప్రైవేట్ నెట్‌సెంటర్‌తోపాటు గతంలో ఉన్న మీసేవ కేంద్రాలతో సమానంగా సచివాయాల్లో సేవలకు సేవాపన్ను వసూలు చేయాల్సి రావడంతో లావాదేవీలు చాలా తక్కువ జరుగుతున్నాయి. ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు తీసుకువచ్చిన వ్యవస్థలోని లోపాలను సరిచేసి మెరుగైన సేవాలందించాల్సిన అవసరం ఉంది.

చంద్రబాబు చరిత్ర.. ముగిసిన అధ్యాయం

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి- కార్వేటినగరం:

టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు చరిత్ర ముగిసిన అధ్యాయమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధి టిటిడిలో విలీనం చేసిన ఆకత్తూరులో వెలసిన శ్రీవరద వెంకటేశ్వరస్వామి ఆలయనిర్మాణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ 18సంవత్సరాలు అధికారంలో ఉంటూ వచ్చిన చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. నవరత్నాలను వ్యతిరేకించే వారు క్యాన్సర్ రోగితో సమానమని తెలిపారు. చంద్రబాబు ఆఖరిదశలో ఉన్నారని, రామోజీరావు రాధాకష్ణ, టీవీ-5 వారు రెండో దశలో ఉన్నారని, పవన్ కళ్యాణ్ మొదటి దశలో ఉన్నారని.. వీరంతా రాష్ట్రాభివద్ధిని అడ్డుకుంటూ క్యాన్సర్ రోగులకు సమానంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైసీపీ నాయకులు ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కులవ్యవస్థలకు స్వస్తి పలికిన వ్యక్తిగా.. నిత్యం పేదల అభివద్ధి కోసం కషిచేస్తున్న వ్యక్తిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. అలాంటి కుటుంబంతో సన్నిహితంగా ఉండటం నాలో మనోధైర్యాన్ని పెంచుతుందన్నారు. కులవత్తులను పెంచి పోషించిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. హిందూ సాంప్రదాయాన్ని గౌరవించే ఏకైక సీఎం జగనన్న అని అభివర్ణించారు. అందుకే హిందూ దేవాలయాల అభివద్ధికి కషి చేస్తున్నారన్నారు. మూడు రాజధానుల ఏర్పాటుకు ప్రజలు కట్టుబడి ఉన్నారని.. చంద్రబాబునాయుడు రియల్‌ఎస్టేట్ కోసమే అమరావతిలో రాజధాని ఉండాలని తన సామాజికవర్గాన్ని రెచ్చగొడుతున్నారని తెలిపారు. అనంతరం కొటార్వేడులో నిర్మాణం చేపడుతున్న అగస్తీశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని సందర్శించారు. అనంతరం గొల్లకండిగ గ్రామంలో సర్పంచ్ భారతి కుమారుడు హరీష్ నూతనదంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ లతాబాలాజీ, రాష్ట్ర ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ దనంజయవర్మ, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్లు కృష్ణయాదవ్, కమలాకర్‌రెడ్డి (పెనుమూరు), సర్పంచ్ పుష్పాంజలి, పురంధర్, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ చేతన్, కార్తీక్‌రెడ్డి, శేఖర్‌రాజు, కష్ణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ వరద వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని సందర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

జాతీయస్థాయిలో..
పెరుమాళ్లపల్లె విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-సోమల: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో పతకాలను సాధించి తమ ప్రతిభను చాటారు. కేరళ రాష్ట్రం వీకే కృష్ణ మీనన్ ఇండోర్ స్టేడియం కోజికోడ్‌లో జరిగిన 11వ జూనియర్, సీనియర్ కరాటే పోటీలలో పాల్గొన్న భరత్ రజత పతకం, రాహుల్ కాంస్య పతకం, వీరేష్ కాంస్య పతకం సాధించి జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు నాగ మల్లీశ్వరి మాట్లాడుతూ గత నెలలో రేణిగుంటలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా.. ముగ్గురు విద్యార్థులు బంగారు పతకాలను సాధించారని.. జాతీయస్థాయిలోనూ ప్రతిభను చూపి పతకాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు సాధించిన విజయంలో కోచ్ మణి పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానంపై అవగాహన




ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తహశీల్దార్ హనుమంతు అన్నారు. ఆదివారం మండలం లోని లింగాపురం, పెద్దపంజాణి, కోగిలేరు గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల పరిధిలో గల గ్రామాల్లో ఓటర్లకు ఓటర్ కార్డుకు వారి వ్యక్తిగత ఆధార్ నెంబరు అప్డేట్ చేసుకోవడం వల్ల ఉపయోగంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడం ద్వారా ఓటర్ల జాబితాలో మరణించిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలు పూర్తిగా తొలగించవచ్చన్నారు. ప్రతి ఒక్క ఓటర్ తన ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోగిలేరు సర్పంచు రమేష్ బాబు, గ్రామస్తులు బాబురెడ్డి, కృష్ణమూర్తి, బసవరాజు, లక్ష్మయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వేపంజేరి ఆలయాన్ని దర్శించుకున్న
మాజీ ఎమ్మెల్యే సతీమణి


సీకే లావణ్యకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న మేనేజర్ వెంకటేశులురెడ్డి

ప్రజాశక్తి -గంగాధర్ నెల్లూరు: వేపంజేరి గ్రామంలో గల శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు సతీమణి సీకే లావణ్య దర్శించుకున్నారు. కార్తీక్ నెల సందర్భంగా 10మంది మహిళలతో కలిసి సీ.కే.లావణ్య ఆలయంలో దీపోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె అష్టలక్ష్మి ఆలయాన్ని, కోనేటి వద్ద గల వివిధ ఆలయాలను ఆమె దర్శించుకున్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్‌కి చెందిన భాగవతార్ చెంచులప్ప హరికథ కాలక్షేపం చేయగా, సిద్దయ్య అన్నమయ్య కీర్తనలు వెంకటేశ్వర భక్తి గీతాలు ఆలపించారు. కాగా ఈనెల 8వతేదీ చంద్రగ్రహణం సందర్భంగా వేపంజేరి ఆలయాన్ని మంగళ వారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6:00 వరకు మూతవేయనున్నట్లు, ఆలయంలో సోమవారం పౌర్ణమి పూజ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా గరుడ సేవ, వాహన సేవ పూజలు ఊరేగింపు ఉంటుందని ఆలయ ట్రస్ట్ కె.ఎస్. శ్రీధర్ చెప్పారు. ఆలయ సిబ్బంది ఆలయ సంప్రదాయ ప్రకారం సీ.కే.లావణ్యకు పట్టువస్త్రాలు అందజేసి స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి అందజేశారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ నాయకులు


- మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు


ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం: టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను ఎస్ఆర్‌పురం మండలంలోని ఆపార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని క్షీరసముద్రం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు జయశంకర్‌నాయుడు నివాసంలో మాజీ ఎమ్మెల్యే ను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రాజశేఖర్‌నాయుడు, హేమాద్రి యాదవ్, సోమేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నాభిషేకం మహోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం




ప్రజాశక్తి-నాగలాపురం: మండలంలోని సురుటపల్లిలో వెలసిన శ్రీ సర్వమంగళ దేవి సమేత శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వాల్మీకేశ్వర స్వామికి అన్నాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ఆదిమూలానికి ఆలయ ఈవో రామ చంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయన్ ఆదివారం ఎమ్మెల్యేకు అందించి ఆహ్వానించారు. అన్నాభిషేకం తిలకించడంతో సంపూర్ణ ఆరోగ్యం లభించడంతో పాటు దోషాలు దూరమవుతాయని ప్రధాన అర్చకులు తెలిపారు. వారితోపాటు వైసీపీ నాయకులు ప్రకాష్ ఉన్నారు.

ప్రజల జీవితాల్లో మార్పు కోసమే ప్రజా సంకల్పయాత్ర


వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి-కార్వేటినగరం: పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేపట్టారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి 5 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటం కోసం నాడు గాంధీజీ పాదయాత్ర చేస్తే, నేడు రాష్ట్ర ప్రజల కష్టాలను తీర్చడానికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేశారని గుర్తు చేశారు. పాద యాత్రలు చేయడం ఒక్క వైఎస్సార్ కుటుంబానికే తగునని, ప్రజలను మభ్యపెట్టేందుకు కుట్ర రాజకీయ నాయకులు చేసే పాదయాత్రలు నమ్మకండని హితవు పలికారు. చంద్రబాబునాయుడు ఎస్సీ సామాజిక వర్గానికి ఎలాంటి న్యాయం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తాను పదవుల కోసం పోరాడటం లేదని.. ఓటర్ల కోసమే పాటుపడుతున్నానన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమాలు అందించే ప్రభుత్వం వైఎస్సీ ప్రభుత్వం ఆదరించే విధంగా చూడాలని నాయకులకు పిలుపునిచ్చారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ధనంజయవర్మ, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, సుబ్బయ్య, పద్మనాభరెడ్డి, శేఖర్ రాజ్, లోకనాధనాయుడు, పద్మనాభరెడ్డి, చందురాజ్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.


భారీ కేక్ కోస్తున్న డిసిసిబి డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం

పలమనేరు: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర నేటికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేష్ గౌడ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు తో కలిసి ఆదివారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలతో కులమత, పార్టీలకతీతంగా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న సీఎం జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పవిత్ర, మురళీకృష్ణ, వైసీపీ పట్టణ కన్వీనర్ ఎస్‌కే ఎస్ జాఫర్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చెంగారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ చాన్ద బాషా కమల్, కిరణ్ కుమార్, సీనియర్ నాయకులు మండి సుధా తో పాటు కౌన్సిలర్లు సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఎస్ఆర్ పురంలో వైసీపీ నాయకులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. చిత్తూరు డిసిసిబి డైరెక్టర్ బాల సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ హరిత, కుప్పయ్య, జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, కొత్తపల్లి యుగంధర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కోసి అందరికీ పంచిపెట్టారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనార్దన్, మణి, హరినాథరెడ్డి, దామోదర్‌నాయుడు, కాలప్ప, దిలీప్‌రెడ్డి, వెంకటేష్ , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత.. అందరివాడు

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్



ప్రజాశక్తి- శాంతిపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కొందరివారు కాదని.. అందరివారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా ఎమ్మెల్సీ భరత్‌తో కలసి ఆదివారం ఉదయం శాంతిపురం మండలం గట్టూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేస్తే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలని.. అందరికీ సమానంగా భూమి ఉండాలని, 21 సంవత్సరాలైతే ఓటు హక్కు ఉండాలని, పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించారన్నారు. కుల వ్యవస్థ రూపుమాలన్నదే ఆయన ఆశయమని తెలిపారు. నాడు-నేడు కార్యక్రమంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివద్ధి చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువుకోవాలన్నదే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయమని.. ప్రతిఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతమ్మ, సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి రబ్బానీ బాషా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఆర్డీవో శివయ్య, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి నాగేశ్వరరావు, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, జడ్పీటీసీలు కోదండరెడ్డి, శ్రీనివాసులు, కుప్పం ఎంపీపీ అశ్విని, మాజీ జడ్పీ ఛైర్మన్ యం.సుబ్రహ్మణ్యంరెడ్డి, దళిత, గిరిజన సంఘాల నాయకులు కష్ణకుమారి, డాక్టర్ యామిల సుదర్శన్, శివ ప్రసాద్, దేవరాజులు, రాజ్ కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

10న ఎస్వీయూలో ఆహార నాణ్యతపై సదస్సు ప్రారంభం




ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గహ విజ్ఞానశాస్త్రం విభాగం, దక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆహారం, నీటి నాణ్యతపై ఈనెల 10,11 తేదీలలో రెండు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ సచిన్ ఖేద్కర్ వెల్లడించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఉపకులపతి చాంబర్‌లో ఆదివారం వర్క్‌షాప్ కన్వీనర్లు డాక్టర్ సచిన్‌ఖేద్కర్, డాక్టర్ కె.వి చరిత మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివద్ధి లక్ష్యాలలో ఆకలిని అంతం చేయడం, మెరుగైన పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన తాగునీరు వంటి అంశాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ లక్ష్యాలను సాధించడానికి ప్రజలందరికీ పౌష్టికాహారం, సురక్షితమైన తాగునీరు అందించడం ప్రభుత్వాల ముఖ్య లక్ష్యమన్నారు. ఉప కులపతి ఆచార్య కె. రాజారెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల సదస్సును డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు, బోధనా సిబ్బంది, పరిశోధకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య హుస్సేన్, వర్సిటీ పీఆర్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్థికశాస్త్రం విద్యార్థులకు ఉపాధి అవకాశాలు



ప్రజాశక్తి -క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఉమెన్ స్టడీస్ విభాగంలో చేరేందుకు విద్యార్థులకు అవకాశం ఉందని.. ఆర్థికశాస్త్ర ఆచార్యులు డాక్టర్ మాధవి తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2022-23 విద్యాసంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఏపీ పీజీసెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అర్థశాస్త్రంలో ఉన్నతమైన అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పీజీసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, సచివాలయం ఉద్యోగాలు, ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్, ఇతర పోటీ పరీక్షలలో ఆర్థిక శాస్త్రం ప్రధాన భాగంగా ఉంటుందని వివరించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పీజీసెట్-2022 పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రంలో చేరేందుకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సదాశివేశ్వర దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం


- ప్రమాణ స్వీకారం చేస్తున్న సదాశివ కోన దేవస్థానం పాలకమండలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సదాశివకోన కామాక్షి దేవి సమేత సదాశివేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం మహోత్సవ వేడుకలు ఆదివారం పట్టణంలోని శివాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్.కె.రోజా మాట్లాడుతూ సదాశివకోనలో భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని.. కమిటీ సభ్యులు ఆలయ అభివద్ధికి కషి చేయాలని కోరారు. అనంతరం సదాశివ కోన శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ సదాశివేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ గా జయచంద్రన్, సభ్యులుగా ఉదయ్ కుమార్, వాసుదేవరెడ్డి, గోపి, రమణ, కమలమ్మ, లక్ష్మీ, వరలక్ష్మి, కోఆప్షన్ సభ్యులుగా అమరనాథస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ ఛైర్మన్, హరి. వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు, మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, రాష్ట్ర డైరెక్టర్లు, ఆలయ కమిటీ ఛైర్మన్లు, పుత్తూరు శివాలయం కమిటీ ఛైర్మన్ రమేష్, దేవాదాయ శాఖ ఆలయాల ఇన్‌స్పెక్టర్ మునికష్ణయ్య, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రవేలురెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఉపాధ్యాయులుగా.. అధ్యాపకులుగా.. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, డైట్ వైస్ ప్రిన్సిపల్‌గా వజ్రవేలురెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఆదివారం స్థానిక మెయిన్ స్కూల్‌లో వజ్రవేలురెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలను ఎస్‌టీయూ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు గంటా మోహన్ మాట్లాడుతూ వజ్రవేల్ రెడ్డి లాంటి నాయకులను కోల్పోవడం ఎస్టీయూ సంఘానికే కాకుండా ఉపాధ్యాయ వర్గానికి తీరని లోటన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డైట్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చెంగల్ రాజు, ఎస్టీయూ చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవరాజులరెడ్డి, మోహన్, రాష్ట్ర కౌన్సిలర్ కఠారి మోహన్ రెడ్డి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, డివిజనల్ కన్వీనర్లు యువరాజు, రమేష్, నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరాజు, సురేష్, వి.యం.రవి, గంటా మోహన్, వెంకటేశులు, కేశవులు, శివప్రసాద్, నాగేంద్రరాజు, రామచంద్రారెడ్డి, దేవరాజులు, ముత్యాలహరి, అమర్‌నాథ్‌రెడ్డి, వజ్రవేలురెడ్డి కుటుంబ సభ్యులు కమల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



సినిమాలను ఆదరించండి

సినీ కథానాయకుడు మన్యం మురళీకృష్ణ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: సినిమాలను ఆదరించాలని సినీ కథానాయకుడు మన్యం మురళీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని బొమ్మయపల్లి గ్రామంలో సినీ కథానాయకుడు బాలమిత్రులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాలు నిజ జీవితంలో ప్రోత్సహించబడతాయని కథానాయకుడు చేపట్టిన మంచి కథలను ఆదరణగా తీసుకొని ప్రతి ఒక్కరు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మాయిపల్లి గౌరీ యూత్ మోహన్ కృష్ణ, లోకేష్, రాజు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు మెంబర్‌ను కలిసిన మాజీ ఎంపీటీసీ సభ్యులు



ప్రజాశక్తి - వెదురుకుప్పం : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ పి.అశోక్ కుమార్‌తో వెదురుకుప్పం మండలం మాంబేడు మాజీ ఎంపిటిసి సభ్యులు బండి రోశిరెడ్డి ఆదివారం ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శనం తర్వాత ఆలయం ముందు కలిశారు. అసోక్ కుమార్, రోసిరెడ్డి యోగక్షేమాలను తెలుసుకున్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నేడు చివరి రోజు

తహశీల్దార్ బెన్‌రాజ్

ప్రజాశక్తి -బంగారుపాలెం: పట్టభద్రుల, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సోమవారంతో ముగిస్తుందని తహశీల్దార్ బెన్‌రాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పట్టభద్రులు ఉపాధ్యాయులు సోమవారం లోపు ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు చేసుకోవాలని ఏడో తేదీ తర్వాత 23వ తేదీ వరకు దరఖాస్తు ఫారాలను పరిశీలన చేపట్టి ఓటర్లను గుర్తిస్తామన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ప్రజాశకి-పులిచెర్ల : మండలంలోని మంగలం పేటలో ఆదివారం తిరుపతి సురేంద్ర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు సర్పంచులు మధు, వెంకటేష్, వాసుదేవరెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరానికి సుమారు 100 మంది హాజరుకాగా 70 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. కంటి అపరేషన్లకు ఎంపికైన 15 మందిని తిరుపతి సురేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ మరిన్ని పరీక్షలు నిర్వహించి సురేంద్ర పర్యవేక్షణలో ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపళ్లికొండేశ్వరస్వామిసేవలో రాకెట్ రాఘవ

ప్రజాశక్తి- నాగలాపురం: మండలంలోని



సురుటపల్లిలో వెలసిన శ్రీ సర్వమంగళ దేవి సమేత శ్రీ పళ్లికొండేశ్వరస్వామి వారిని ఆదివారం జబర్దస్త్ నటుడు రాకెట్ రాఘవ తన కుటుంబ సభ్యులతో దర్శించు కున్నారు. ఆలయాధికారులు, ఆలయ అర్చకులు వారికి దర్శన ఏర్పాట్లు చేయించి తీర్థప్రసాదాలు అందించారు. ఆయనతోపాటు సత్యవేడు జడ్పీటీసీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరి మృతి


మృతిచెందిన మధు, చిన్నారి బుజ్జి

ప్రజాశక్తి - కార్వేటినగరం: ముందు వెళ్లే ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడుతో సహా చిన్నారి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గాజంకి సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గాజంకి దళితవాడకు చెందిన మధు(30) ఇంట్లో జరుగుతున్న సీమంతానికి వెదురుకుప్పం మండలం అగ్రహారం గ్రామంలో మధు చెల్లెలను ఆహ్వానించారు. దీంతో మధు చెల్లెలు, మరిది వంశీ(17)తో పాటు బుజ్జి(3) కార్యాక్రమానికి పంపారు. పచ్చికాపల్లంలో బస్సు దిగడంతో సమాచారం అందుకున్న మధు తన ద్విచక్ర వాహనంలో పచ్చికాపల్లం వెళ్లి వంశీతో పాటు చిన్నారి బుజ్జి గాజంకికి తీసుకెళ్తుంగా ఇగువ ఎర్రమరాజుపల్లెకి గాజంకి మార్గంమధ్యలో ముందు ట్రాక్టర్ వెనుక ఆర్టీసీ బస్సు ఉండటంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో మధుతోపాటు చిన్నారి బుజ్జి అక్కడికక్కడే మృతిచెందారు. వంశీ తీవ్రంగా గాయపడటంతో 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఈతకు వెళ్లి విద్యార్థి...

ప్రజాశక్తి - కార్వేటినగరం: ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొల్లగుంట గ్రామం బీసీ కాలనీలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా... కొల్లాగుంట బీసీ కాలనీకి చెందిన వి.రవి, లావణ్య కుమారుడు వి.యువశంకర్(10) స్థానిక సాయి విద్యానికేతన్ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో యువశంకర్ తన తమ్ముడు వి.పార్థిన్(7), అదే గ్రామానికి చెందిన మనోజ్(8) కలసి గ్రామ సమీపంలోనే కుశస్థలీ నదిలో ఈతకు వెళ్లారు. అయితే నదిలో ఉన్న బండపై ఎక్కడంతో యువ శంకర్ కాలుజారి నీటిలో పడ్డాడు. ఊపిరి ఆడకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో అతని తమ్ముడు, వారితో వచ్చిన మనోజ్ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకునే లోపే యువశంకర్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు కుమారుడి మృత దేహాన్ని చూసి బోరున విలపించారు. మేస్త్రీ పని చేసుకుంటూ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్న కల కళ్లముందే చెదిరిపోయిందని తలలు బాదుకుంటూ రోధించడం అక్కడి వారి గుండెలు పిండేశాయి. ఎప్పుడూ ఎక్కడికీ పంపించని పిల్లలు ఏటిలో ఈతకోసం వెళ్లి మృత్యువాత పడటం గ్రామస్తులు జీర్ణించుకోలేక గ్రామం శోకసంద్రంగా మారింది.

టిప్పర్ ఢీకొని వ్యక్తి...



ప్రజాశక్తి-పూతలపట్టు : మండలంలోని వంటిల్లు సమీపంలో గల శరవణ భవన్ ముందు గల సర్వీస్ రోడ్డులో టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే. పూతలపట్టు మండలంలోని ఆకానంబట్టు గ్రామం శరవణ హోటల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసే లేట్ చిన్నబ్బ కుమారుడు పి.చిరంజీవి(52) రోడ్డు దాటుతుండగా ఒక టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో చిరంజీవికి కాలు నుజ్జు నుజ్జు అయ్యి, తీవ్ర రక్తస్రావమైంది. శరీరానికి అయిన మొద్దు గాయాల కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. జరిగిన ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేస్తున్నట్టు పూతలపట్టు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

అనుమానాస్పదంగా వివాహిత ..



ప్రజాశక్తి- ఐరాల: ఓ వివాహిత అనుమాన స్పద స్థితిలో చెరువులో పడి మతి చెందిన సంఘటన ఐరాల మండలం పరిధిలోని ఆడపగుండ్ల పల్లి చెరువులో ఆదివారం మధ్యాహ్నం వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం మేరకు.. మద్దిపట్లపల్లి గ్రామానికి చెందిన జమున(35) ఆదివారం మధ్యాహ్నం ఆడపగుండ్లపల్లి చెరువులో శవమై తేలడంతో పశువుల కాపరులు గుర్తించారు. కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. కాణిపాకం పోలీసులు మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

వైసిపి సీనియర్ నాయకుడికి నివాళి



ప్రజాశక్తి-పెద్దపంజాణి: నేలపల్లి గ్రామంలోని వైసీపీ సీనియర్ నాయకులు రాఘవరెడ్డి శనివారం మృతి చెందారు. స్థానిక నాయకుల సమాచారంతో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రెడ్డప్ప ఆదివారం మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మృతుని కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కుటుంబసభ్యులకు తెలియజేశారు. స్థానిక మాజీ ఎంపీటీసీ ప్రసాద్ రెడ్డి, బుజ్జి రెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ కండ్రిగలో 'మీకోసం-మీ తెలుగుదేశం'



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలంలోని లక్ష్మమ్మ కండ్రిగలో ఆదివారం నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి భానుప్రకాష్ ఆధ్వర్యంలో 'మీకోసం-మీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించారు. గ్రామస్థులు పూలతో స్వాగతం పలికారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి రాబోయే రోజుల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.